సాక్షి నిజామాబాద్

శుక్రవారం : 3 : ఫిబ్రవరి : 2023



ఆదర్శ పాఠశాలలో విచారణ

సిరికొండలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని కొట్టిన ఘటనపై అధికారులు విచారణ చేశారు.

- 8లో ▸



నేడు ధ్రువపత్రాల పరిశీలన

విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి నేడు ఉద్యోగుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించనున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం **30.5 /16.9**

మంచు కురుస్తుంది. ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

3,404 బదిలీ దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో బదిలీల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. జిల్లావ్యాప్తంగా 3,404 మంది టీచర్‌లు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 28 తేదీ నుంచి బదిలీ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పీజీహెచ్‌ఎంలు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మూడేళ్లు పూర్తయిన వారిని అర్హులుగా గుర్తించారు. ఐదేళ్లుగా బదిలీలు లేకపోవడంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన చేస్తున్నారు. పదోన్నతుల ప్రక్రియ ముగియగానే బదిలీలు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

బర్ధిపూర్ పంప్‌హౌస్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

- రూ. 34 లక్షల నష్టం



డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌కు సంబంధించిన 2 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం మంటలు చెలరేగి దగ్ధం అయింది. రైతులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలికి విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి యత్నించినా సాధ్యం కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే ఆయిల్ వల్ల నీళ్లు పోస్తే మరింతగా మంటలు రావడంతో ఫైరింజన్ సిబ్బంది నీళ్లు చల్లడం నిలిపి వేశారు. ఆయిల్ మొత్తం కాలిపోయిన తర్వాత మంటలు ఆగిపోయాయి. ఘటనా స్థలానికి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్, అధికారులు ఉత్తమ్, రాజేశ్వర్, బాలేష్, రాజేందర్, ఇరిగేషన్ అధికారులు గంగాధర్, శ్రీచంద్, కిరణ్‌లు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆయకట్టు రైతుల నేతృత్వంలోనే పంప్‌హౌస్, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ కొనసాగుతోంది. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయగా ఆయకట్టు రైతుల వినతి మేరకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈ ట్రాన్స్‌పార్మర్‌ను మంజూరు చేయించారు. గత ఏడాది మార్చిలో పంప్‌హౌస్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు.

దీంతో ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ ద్వారా ఆయకట్టు గ్రామాల చెరువులకు నీళ్లు సరఫరా అయ్యాయి. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆయకట్టు గ్రామాల పంటలకు ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపొద్దు



ఆర్మూర్ టౌన్ : ఆర్టీసీ బస్ డ్రైవర్లు ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడపకూడదని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం శంకర్ సూచించారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ 'మర్యాద, సురక్షిత డ్రైవింగ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం ఆర్మూర్ డిపోలో ఎయిర్ బస్ డ్రైవర్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, వర్షాకాలం, చలికాలంలో పొగ మంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఆర్టీసీలో సీనియర్ డ్రైవర్ బాలయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, పృథ్వీరాజ్, వీవీ రెడ్డి, అహ్మద్, ఎయిర్ బస్ డ్రైవర్‌లు బద్రి, రాజు, మోహన్, లింగం, రాజేందర్ పాల్గొన్నారు.

దేశ సేవ కోసం పాటుపడాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రతి విద్యార్థి దేశ సేవ కోసం పాటు పడాలని ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బస్వా గార్డెన్‌లో ఏబీవీపీ జిల్లా విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. జ్ఞానం, ఏకాగ్రతను విద్యార్థులు పెంపొందించుకోవాలని, అలాగే తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. యువత డ్రగ్స్ మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల పట్ల గౌర వంగా ఉండాలన్నారు. విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్, నగర అధ్యక్షులు వెంకటకృష్ణ, విభాగ కన్వీనర్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు..

పసుపుకేదీ పసిడి ధర!

- పచ్చ బంగారానికి ఆశించినంత లభించని ధర
- క్వింటాలుకు రూ.6వేలు కూడా దక్కని పరిస్థితి
- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు
- ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపాటు
- వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తుతున్న పసుపు



నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు రాశులు

ఇందూరు (నిజామాబాద్ అర్బన్) : ఒకప్పుడు పసుపును అమ్మితే బంగారంతో సమానంగా డబ్బులు వచ్చేవి. ప్రస్తుతం మార్కెట్‌లో పసిడి పరుగులు పెడుతున్నా... రైతులు పండించిన పచ్చ బంగారానికి మాత్రం విలువ పెరగడం లేదు. వ్యవసాయ మార్కెట్లలో క్వింటాలుకు రూ.6 వేలు కూడా ధర దక్కడం లేదు.

దీంతో రైతులు మదన పడుతున్నారు. ధర విషయంలో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాలకు పైగా పసుపు పంట సాగైంది. ఇప్పటికే చాల మంది రైతులు పంటను తవ్వి బయటకు తీశారు. బాయిలర్లలో ఉడికించి ఎండలో ఎండబెడుతున్నారు. ఎండిన దానిని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పసుపు మార్కెట్‌కు వస్తోంది. దీంతో ఎటు చూసినా పసుపు రాశులే కనిపిస్తున్నాయి. రోజుకు మూడు వేల క్వింటాళ్లకు పైగా విక్రయాలకు జరుగుతుండగా, ఇందులో కొమ్ము పసుపు, మండ పసుపు, చూర పసుపు రకాలున్నాయి.

అయితే, పసుపు పంటకు ఎక్కువ రేటు వచ్చే మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌ను మొన్నటి వరకు తెరవలేదు. దీంతో ప్రతి యేటా సాంగ్లికి వెళ్లే రైతులు నిజామాబాద్ యార్డుకు పసుపును తెచ్చి విక్రయిస్తున్నారు. రైతులు తెచ్చిన పంట నాణ్యతను మార్కెట్ యార్డు అధికారులు పరిశీలించి గ్రేడ్‌లను నిర్ణయిస్తున్నారు. ఒక్కో బస్తాను 60 కిలోలు తూకం వేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో మార్కెట్‌కు పసుపు మరింత పోటెత్తనుంది. అప్పటి వరకు ధర పెరుగుతుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

గురువారం పసుపు అమ్మకాలు ఇలా.. (రూ.లలో)

పంట రకం	గరిష్ట ధర	కనిష్ట ధర	మోడల్ ధర
కొమ్ము పసుపు	6,325	4,000	5,289
మండ పసుపు	5,800	3,500	4,637
చూర పసుపు	5,651	4,001	4,820

దెబ్బతీసిన దుంపకుళ్లు..

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఈ ఏడాది పసుపు పంటను దుంపకుళ్లు తెబ్బతీశాయి. గతేడాది ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో కురిసిన అధిక వర్షాల కారణంగా పంటకు తెగుళ్లు సోకాయి. పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరానికి 25–30 క్వింటాళ్లు రావాల్సిన పంట తెగుళ్ల కారణంగా సగానికి పడిపోయింది. కొంతమంది రైతులకు పెట్టుబడి డబ్బులు కూడా రాక నష్టపోతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న పసుపును చూస్తే తెగుళ్ల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటు పసుపు రాశులు పెద్ద ఎత్తున వస్తుండడంతో మార్కెట్ యార్డులో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తేమశాతం కొలిచే యంత్రాలు, తూకంకాంటాలు, కూలీలను సిద్ధం చేసి ఉంచారు.

ఆశించిన ధర లేదు..



ఈ ఏడాది పసుపు సాగు చేసిన రైతులకు ధర మంచిగ లేదు. మార్కెట్‌కు అమ్మడానికి వచ్చినా ఆశించిన రేటు రావడం లేదు. నేను 22 క్వింటాళ్లు తీసుకువస్తే క్వింటాలుకు రూ.4,900 మాత్రమే ధర వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఇది చాల తక్కువ. ఇప్పటికే దుంపకుళ్లు రోగంతో సగం పంటే చేతికొచ్చింది.

– భూమన్న, రైతు, వన్నెల్(బి), బాల్కొండ మండలం

ప్రభుత్వాలు చొరవ చూపాలి..



పోయిన ఏడాది మంచి క్వాలిటీ పసును సాంగ్లిలో అమ్మితే క్వింటాలుకు రూ.9వేలు వచ్చింది. అక్కడ మార్కెట్ తెరవలేదని నిజామాబాద్ యార్డుకు వచ్చాను. ఇక్కడ గ్రేడ్–1 పసుపు కొమ్ములకు రూ.6,300 వచ్చింది. ఇప్పటి వరకు ఇదే ఎక్కువ అయినప్పటికీ, ఆశించిన ధర కాదిది. ప్రభుత్వాలు ఈ విషయంలో చొరవచూపి పసుపు రైతులకు మంచి ధర ఇప్పించాలి.

– నాగులపల్లి రాజేశ్వర్, రైతు, వన్నెల్(బి), బాల్కొండ మండలం

క్వాలిటీ ఉంటే ధర వస్తుంది..



పంటను మార్కెట్‌కు తెచ్చే ముందు రైతులు పసుపును బాగా ఎండనివ్వాలి. మంచి క్వాలిటీ ఉన్న పంటకు మంచి ధర లభించే విధంగా మార్కెట్ అధికారులు పని చేస్తారు. ధర నచ్చకపోతే వేరే వ్యాపారి ఎక్కువ రేటుకు కొనే విధంగా చూస్తాం. ఇబ్బందులుంటే మా దృష్టికి తేవాలి.

– వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్

కలకలం రేపిన విద్యార్థి మృతి

- మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘటన
- గతంలోనూ విద్యార్థుల మధ్య పరస్పర దాడులు
- లోపించిన అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ



నిజామాబాద్ అర్బన్ : డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తొమ్మిదో తరగతి విద్యార్థి షేక్ సోఫియాన్ (14) మృతి చెందడం తీవ్రకలకలం రేపింది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. ఈ గురుకులంలో గతంలోనూ విద్యార్థుల మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే గురువారం జరిగిన ఘటనలో విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాజాగా జరిగిన ఘటన నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు కొన్ని రోజులుగా వార్డెన్ అందుబాటులో లేడని తేల్చారు. అయితే వార్డెన్ రిజిష్టర్‌లో మాత్రం సంతకాలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.ఈ మైనార్టీ గురుకుల పాఠశాలను మొదట జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి వద్ద ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. గతంలో పదవతరగతి 'ఎ' సెక్షన్ విద్యార్థులు, 'బి' సెక్షన్ విద్యార్థుల మధ్య వరుసగా రెండు రోజుల పాటు పరస్పర దాడులు జరిగాయి. ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకున్నారు. చాలా మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసి విచారణ జరిపారు. కొందరు సిబ్బందిపైన చర్యలు తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బర్ధిపూర్ శివారులోని ఓ జూనియర్ కళాశాల భవనంలోకి మైనారిటీ గురుకుల పాఠశాలను మార్చారు. ఇక్కడ మళ్లీ మధ్యాహ్న భోజన సమయంలో బెంచీపై కూర్చునే విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య వివాదం చెలరేగి జరిగిన ఘర్షణలో నగరంలోని గౌతంనగర్‌కు చెందిన షేక్ సోఫియాన్ మృతి చెందాడు.

గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో ఉపాధ్యాయులు, సిబ్బంది సరైన సమయానికి రావడం లేదని, పాఠశాలలో ఎక్కువ సమయం కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రిన్సిపల్, వార్డెన్ తొలగింపు

మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతితో అవుట్ సోర్సింగ్ పద్ధతిన కొనసాగుతున్న ప్రిన్సిపల్ జలీల్‌అహ్మద్, వార్డెన్ జఫీరొద్దీన్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రతన్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి మృతి ఘటనపై కలెక్టర్ విచారణ చేపట్టారు. ఇందులో ప్రిన్సిపల్ నిర్లక్ష్యవైఖరి, వార్డెన్ జఫీరొద్దీన్ నెల రోజులుగా పాఠశాలకు రావడం లేదని, అయినా సంతకాలు చేసి ఉండడాన్ని అధికారులు గుర్తించారు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

పనులు పూర్తయితే బిల్లులివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు పూర్తయితే వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ మన ఊరు – మన బడి పనుల ప్రగతిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రానందున పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పనులు గ్రౌండింగ్ జరగని పాఠశాలల్లో మరోమారు టెండర్లు పిలిచి, తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రూ.30లక్షలకు పైబడిన విలువ కలిగిన పనులు కూడా వెంటనే ప్రారంభమయ్యేలా కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించాలన్నారు. తదుపరి సమీక్ష జరిపే నాటికి పనుల్లో స్పష్టమైన ప్రగతి కనిపించాలని, సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఈవో దుర్గాప్రసాద్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు దేవిదాస్, శంకర్, మురళి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం పాకులాట

- విద్యాశాఖలో సీనియారిటీ జాబితా నుంచి అర్హుడైన టీచర్ తొలగింపు
- చక్రం తిప్పుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకుడు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న పదోన్నతుల ప్రక్రియలో పైరవీలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం కొన్నేళ్ల తర్వాత తాజాగా పదోన్నతుల ప్రక్రియకు అనుమతి ఇవ్వడంతో దరఖాస్తుల స్వీకరణ, ఖాళీల ప్రదర్శన, సీనియారిటీ జాబితా రూపొందించారు. రెండు రోజుల క్రితం సర్టిఫికెట్ల పరిశీలన కూడా నిర్వహించారు. ఇందులో పీజీహెచ్‌ఎంల సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. సీనియారిటీ జాబితాలో ముందున్నవారికి ముందు కోరుకునే ప్రాంతం లభిస్తుంది. ఈ సందర్భంలో ఓ సంఘం నాయకుడు తనకు అనుకూలమైన ప్రాంతం కోసం పైరవీలు చేసి అర్హుడైన ఉపాధ్యాయుడిని సీనియారిటీ జాబితా నుంచి తొలగింపజేశారు. ఈ వ్యవహారంలో విద్యాశాఖ అధికారులు కూడా లోతుగా పరిశీలించకపోవడం గమనార్హం. నగరంలోని దుబ్బ పాఠశాలకు చెందిన విజయ్ కుమార్ సీనియార్టీ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నారు. ఇందుకోసం సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తి చేసుకున్నారు. కాని సదరు సంఘం నాయకుడు విజయ్‌కుమార్ పదో తరగతి, ఇంటర్ పూర్తి చేయలేదని సీనియారిటీ జాబితా నుంచి తొలగించాలని పదోన్నతి ఇవ్వొద్దని డీఈవోకు ఫిర్యాదు చేశారు. సంఘం నాయకుల ఒత్తిడికి తలొగ్గి విద్యాశాఖాధికారులు సీనియారిటీ జాబితా నుంచి విజయ్ కుమార్‌ను తొలగించారు. దీంతో పైరవీ చేసిన ప్రభుత్వ విభాగానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకుడికి లైన్ క్లియరైంది. 2015లోనూ టీచర్ విజయ్ కుమార్‌ను సదరు నాయకుడు అడ్డుకున్నాడు. మరోవైపు ఇదే సీనియారిటీ జాబితాలో 9 నెలల పాటు సస్పెన్షన్ వేటుపడి మళ్లీ విధుల్లో చేరిన ఉపాధ్యాయ సంఘం నాయకుడి పేరు చేర్చారు. ప్రస్తుతం ఆయనకు పదోన్నతి వచ్చే అవకాశముంది. అయితే తనకు న్యాయం చేయాలని ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల గోడు వినిపిస్తారా?

- నేటి నుంచి మొదలుకానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు
- సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గళం విప్పాలంటున్న ప్రజలు
- ఇప్పుడున్న ప్రభుత్వానికిదే చివరి బడ్జెట్



మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ఆరంభం కానున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలతో మార్గం దొరుకుతుందా అనే చర్చ జరుగుతోంది. ఇప్పుడున్న ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ కావడం.. రానున్న నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో బడ్జెట్ సమావేశాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ముందస్తు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన అనేక హామీలలో ప్రధానమైన పంట రుణాల మాఫీ, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ, సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం, అర్హులైన వారికి జీవన భృతి, ఆసరా పింఛన్లు ఇలా ఎన్నో రకాల హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణ..

జిల్లాలో ఇప్పటి వరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణకు చర్యలు తీసుకోలేదు. జిల్లావ్యాప్తంగా వరితో పాటు పసుపు, సోయా, నువ్వులు, మొక్కజొన్న, ఎర్రజొన్నలు, తెల్లజొన్నలు విస్తారంగా సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర, మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం గతంలో తెలిపింది.

ప్రవాసీ విధానం లేదా గల్ఫ్ బోర్డు

తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న వారి కోసం కేరళ తరహాలో ప్రవాసీ విధానం లేదా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రూ.500 కోట్ల కేటాయింపుతో పాటు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి వలస కార్మికుల కుటుంబాలకు చేయూతనివ్వాలనే ప్రధాన డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

పేస్కేల్ కోసం సెర్ప్ ఉద్యోగులు..

గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం(సెర్ప్) కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ అమలు చేయనున్నట్లు గతంలో ప్రభుత్వం ప్రకటించింది.

2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశ పెట్టిన బడ్జెట్ సమావేశాల్లోనే సీఎం ప్రకటన చేశారు. కాని ఇప్పటివరకు అమలు కాలేదు. పేస్కేల్ అమలు చేస్తే జిల్లాలో 218 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగనుంది.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

గడిచిన బడ్జెట్ సమావేశాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వైద్య ఆరోగ్య శాఖ, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు వివిధ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. జిల్లాలో 378 మంది ఉద్యోగులు రెగ్యులరైజ్ కోసం నిరీక్షిస్తున్నారు.

అసెంబ్లీలో మనోళ్లదే హవా..

- స్పీకర్ పోచారం అధ్యక్షతన నిర్వహణ
- మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- విప్ హోదాలో గంప, ప్యానెల్ స్పీకర్‌గా హన్మంత్ సింధే

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో మనోళ్ల హవా కొనసాగుతోంది. అసెంబ్లీ స్పీకర్ హోదాలో సీనియర్ నాయకుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గడిచిన నా లుగేళ్లుగా తనదైన శైలిలో సభను నడుపుతున్నారు. అలాగే శాసనసభ వ్యవహారాల మంత్రి హోదాలో వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించడమే గాకుండా శాసన మండలిలో ఏటా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ వస్తున్నారు. శాసనసభలో ప్రభుత్వ విప్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వరుసగా రెండో సారి కొనసాగుతున్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్యానెల్ స్పీకర్ హోదాలో అవకాశం వచ్చినపుడు అసెంబ్లీకి అధ్యక్షత వహిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రతీసారి ఉమ్మడి జిల్లాకు చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు గంప గోవర్ధన్, హన్మంత్‌సింధేలు తమ పాత్రను పోషిస్తున్నారు. నేటి నుంచి రాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..

పోచారం అధ్యక్షతన..

ఉమ్మడి జిల్లాలో సీనియర్ రాజకీయ నేతగా ఉన్న పోచారం నాలుగు దశాబ్దాలుగా అనేక పదవులు అధిష్టించారు. టీడీపీ ప్రభుత్వంలో, టీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో ఆయన మంత్రిగా కీలక మైన శాఖలు నిర్వహించారు. సీనియర్ సభ్యుడిగా అనేక అనుభవాలు ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ స్పీకర్‌గా ప్రతిపాదించారు. దీంతో 2019 జనవరి 9 నుంచి ఆయన అసెంబ్లీ స్పీ కర్‌గా పనిచేస్తున్నారు.

గత సమావేశాల్లో అవకాశం

జుక్కల్ శాసన సభ్యుడు హన్మంత్ సింధే ప్యానెల్ స్పీకర్‌గా అప్పుడప్పుడు అధ్యక్షత వహించే అవకాశం లభిస్తుంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లు అందుబాటులో లేని సమయంలో కొంతసేపు ప్యానెల్ స్పీకర్ హోదాలో స్పీకర్ స్థానంలో కూర్చుని సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది.

రెండు సార్లు ప్రభుత్వ విప్‌గా..

కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రభుత్వ విప్ హోదాలో తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నారు. సాధారణంగా చీఫ్ విప్, విప్‌లు అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులు నెగ్గే విషయంలో తమ పార్టీకి చెందిన వారిని సమన్వయం చేసే బాధ్యత నిర్వహిస్తారు.

ప్రశాంత్‌రెడ్డి కీలక భూమిక

ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి హోదాలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణలో ఆయనది కీలకపాత్ర. అంతేగాక అసెంబ్లీతో పాటు మండలిలోనూ ఏకకాలంలో బడ్జెట్ ప్రవేశపెట్టాలనే సీఎం నిర్ణయంతో గత నాలుగేళ్లుగా శాసన మండలిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. ఈసారి కూడా బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ బాధ్యతలన్నీ ఆయనే మోస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూ, టీటీడబ్ల్యూ గురుకుల కళాశాలల ప్రాంతీయ సమన్వయకర్త టి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని ప్రవేశ పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 5లోపు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 17లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జూనియర్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించి వివరాల కోసం 9121174434 నంబర్‌కు, డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు 7901097707, నిజామాబాద్‌కు చెందిన వారు 7901097710 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఓయూ ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు సన్మానం



భిక్కనూరు: ఉస్మానియా యునివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ నగేష్‌ను సౌత్ క్యాంపస్ జియో ఇన్ఫర్‌మెటిక్స్ విభాగం అధ్యాపకులు సన్మానించారు. గురువారం ఓయూలో ఆయనను కలిసి శాలువా, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ ఆర్ సుధాకర్‌గౌడ్, ప్రొఫెసర్లు టి ప్రతిజ్ఞ, ఎస్ నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన జడ్జి



ఖలీల్‌వాడి: మాక్లూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి గురువారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు ఉన్నారు.

అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ



ఖలీల్‌వాడి: బస్సు ప్రమాదాలు నివారణకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణను ఆర్ఎం ఉషాదేవి గురువారం ప్రారంభించారు. నగరంలోని ఆర్ఎం ఆఫీసులోని ట్రెనింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు నివారించే విధానాలు నేర్పడానికి ఆర్టీసీ మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రూల్స్ పాటించడంతో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ లక్ష్మణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నగర ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, డిప్యూటీ ఆర్ఎం శంకర్, డీఎం ఆనంద్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



కామారెడ్డి టౌన్: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కామారెడ్డి ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం డిపో కార్యాలయంలో బస్సు డ్రైవర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం లక్కు మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్ : నేడు జిల్లా విద్యాశాఖలో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు. అందుకు సంబంధించి సీనియారిటీ జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. దీని ప్రకారం పదోన్నతి కల్పిస్తామని వీరు ధ్రువపత్రాల కోసం రావాలని డీఈవో పేర్కొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలనకు రావాలి

పదోన్నతులకు సంబంధించి అర్హులైన భాషా పండితులు, పీఈటీలు ధ్రువపత్రాల పరిశీలన కోసం డీఈవో ఆఫీస్‌కు రావాలని డీఈవో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ గణితం, బయోసైన్స్, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్‌కు పదోన్నతి పొందేవారు రావాలని ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు డైట్‌లో ప్రవేశాలకు..

గతంలో కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారికి డైట్ కళాశాలలో ప్రవేశాల కోసం నేడు ధ్రువపత్రాల పరిశీలన చేయనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండు విడతల్లో హాజరు కానివారు నేడు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి ఈనెల 6 తేదీ నుంచి 9 తేదీ వరకు కళాశాలల ఎంపిక ఈనెల 14 తేదీ నుంచి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈనెల 14 నుంచి 17 వరకు రిపోర్ట్ చేయాలన్నారు. 21వ తేదీ రిపోర్టింగ్‌కు చివరి తేదీ ఉంటుందన్నారు.

జనరల్ లోకల్ బాడీ టీచర్ల పదోన్నతులిలా..

కేటగిరి	పదోన్నతి పొందే పోస్టు	చేరిన డీఎస్సీ
ఎస్జీటీ	ఎస్ఏ(గణితం)తె/మీ	2001
ఎస్జీటీ	ఎస్ఏ(బయోసైన్స్)తె/మీ	2001
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)తె/మీ	2001
ఎస్జీటీ	ఎస్ఏ(ఇంగ్లీష్)	2000
ఎస్జీటీ	ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం/తె/మీ	2001
ఎస్జీటీ	ఎస్ఏ(బయోసైన్స్)ఉ/మీ	2001
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)ఉ/మీ	2001

ప్రభుత్వ విభాగం వారికి..

ఎస్జీటీ	ఎస్ఏ(గణితం) తె/మీ	2008
ఎస్జీటీ	ఎస్ఏ(బయోసైన్స్)తె/మీ	2003
ఎస్జీటీ	ఎస్ఏ(ఫిజికల్ సైన్స్)తె/మీ	2008
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)తె/మీ	2000
ఎస్జీటీ	ఎస్ఏ(ఇంగ్లిష్)	1996
ఎస్జీటీ	ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం తె/మీ	1996
ఎస్జీటీ	ఎస్ఏ(బయోసైన్స్)ఉ/మీ	2012
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)ఉ/మీ	2000
ఎస్జీటీ	ఎస్ఏ(గణితం)ఉ/మీ	2012

లోకల్ బాడీ టీచర్లకు..

కేటగిరి	పదోన్నతి పొందే పోస్ట్	ఏడాది
ఎస్జీటీ	ఎస్ఏ(గణితం)తె/మీ	2002
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)తె/మీ	జనరల్ సీనియారిటీ ప్రకారం

వికలాంగ ఉపాధ్యాయులకు..

కేటగిరి	పదోన్నతి పొందే పోస్టు	ఏడాది
ఎస్జీటీ	ఎస్ఏ(గణితం)తె/మీ	వీహెచ్ అందరు
ఎస్జీటీ	ఎస్ఏ(బయోసైన్స్)తె/మీ	వీహెచ్ అందరు హెచ్‌హెచ్ అందరు
ఎస్జీటీ	ఎస్ఏ(సోషల్)తె/మీ	వీహెచ్ మహిళలు హెచ్‌హెచ్ అందరు
ఎస్జీటీ	ఎస్ఏ(ఇంగ్లీష్)తె/మీ	వీహెచ్ మహిళ, అందరు

హాస్టల్‌లో వసతులపై స్పీకర్ ఆరా

బాన్సువాడ టౌన్: దేశాయిపేట్‌లో నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్‌లో లోవోల్టేజ్ సమస్య ఉందని విద్యార్థులు పేర్కొనడంతో స్పందించిన స్పీకర్ వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాక్టికల్ సమయంలో మాత శిశు ఆస్పత్రికి వెళ్లేందుకు హాస్టల్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో రాజాగౌడ్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన స్వగ్రామమైన పోచారంలో పర్యటించి అక్కడ చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరిగె రాధ, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, సాయిరెడ్డి, లతీఫ్, కమటాల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, సయ్యద్ జలీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ నిజాయితీ

- పోగొట్టుకున్న బంగారం బాధితురాలికి అందజేత

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ తన పర్సును పోగొట్టుకోగా డ్రైవర్, కండక్టర్‌లు ఆ పర్సును తీసుకుని మరుసటి రోజు బాధితురాలికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి బుద్ద భాగ్య మంగళవారం సాయంత్రం కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో పెద్దమల్లారెడ్డి బస్సు ఎక్కింది. వారి పిల్లలను తీసుకెళ్లడానికి దోమకొండలో దిగి అక్కడి నుంచి ఆటో ఎక్కి డబ్బుల కోసం చూసుకునే సరికి బస్సులో పర్సు పోగొట్టుకున్నానని గమనించి ఆమె రోదిస్తూ డిపోకు వెళ్లింది. అక్కడి అధికారులు సమాచారం ఇవ్వగా డీఎం లక్కు మల్లేశం బస్సులో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ ఏ నరహరి, డ్రైవర్ ఎస్ రాజుకు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. బస్సులో ఓ ప్రయాణికుడు తన పర్సు అని వాదించగా అతని వద్ద నుంచి కండక్టర్ పర్సును స్వాధీనం చేసుకున్నారు. పర్సులో ఐదు తులాల పుస్తెల తాడు, నల్లపూసల దండతో పాటు రూ.1500 నగదు ఉంది. రాత్రి డీఎం చాంబర్‌లో సదరు మహిళకు పర్సు, బంగారం గోలుసు, నగదును అందించారు. మహిళ కన్నీళ్లతో ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. అధికారులు కూడా అభినందనలు తెలిపారు.



మహిళకు బంగారం అందజేస్తున్న సిబ్బంది

క్షతగాత్రులకు సేవలందించాలి

సదాశివనగర్: ప్రమాదాలకు గురైన వారికి అతిత్వరగా సేవలందిస్తే వారి ప్రాణాలను రక్షించిన వాళ్లవుతామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు మొదటి గంటలో అందించే సేవలు చాలా ముఖ్యమన్నారు. గురువారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో నిర్వహించిన యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. నియమాలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమానికి హాజరైన పోలీస్ సిబ్బందికి, పెట్రోల్ పంపుల ఉద్యోగులకు, ఎన్‌హెచ్ఏఐ ఉద్యోగులకు, విద్యార్థులకు, ఆటోడ్రైవర్లకు, హోటల్ యజమానులకు సర్టిఫికెట్లను అందజేశారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థి బక్కూరి విరాట్‌ను చితకబాదిన పీఈటీ జయపాల్‌పై విద్యార్థి తండ్రి శ్రీనివాస్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన విరాట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాగా విద్యార్థి పాఠశాలకు రాకుండా గ్రామంలో బైక్‌పై తిరుగుతున్నాడని గ్రామానికి చెందిన ఒకరు పాఠశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని ప్రిన్సిపాల్ ఆదేశాలతో పీఈటీ మందలిస్తూ విచక్షణ రహితంగా దండించాడు. విద్యార్థిని వెన్ను, తొడలపై తీవ్ర గాయాలు కావడంతో తండ్రి శ్రీనివాస్ ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాఠశాలకు నోటీసులు

క్షత్రియ పాఠశాల కరస్పాండెంట్‌కు ఎంఈవో రాజగంగారం నోటీసులు జారీ చేశారు. విద్యార్థిని విచక్షణ రహితంగా ఎందుకు దండించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉండే పిల్లి లక్ష్మి(68) అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని పట్టణ ఎస్‌హెచ్ నరేష్ గురువారం తెలిపారు. వృద్ధురాలు కనిపించకపోవడంతో చుట్టు పక్కలవారు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేసే ఆమె కుమారుడు హరిప్రసాద్‌కు ఈ నెల 1న సమాచారం ఇచ్చారు. అతడు కామారెడ్డికి వచ్చి చాలా చోట్ల గాలించాడు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ చోరీ

కామారెడ్డి క్రైం: గుర్తు తెలియని వ్యక్తులు ఓ లారీని అపహరించిన ఘటన కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో గురువారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన అబ్దుల్ హకీం తన లారీని ఎప్పటిలాగే బుధవారం రాత్రి ఇంటికి సమీపంలోని మజీద్ రోడ్డు వద్ద పార్క్ చేశాడు.

ఉదయం వెళ్లి చూసేసరికి లారీ కనిపించలేదు. సుమారు 6 గంటల ప్రాంతంలో ఎవరో లారీని స్టార్ట్ చేసినట్లు శబ్దం వినబడిందని దగ్గర్లో నివాసం ఉండేవారు చెబుతున్నారు. చుట్టుపక్కల గాలించినా లారీ ఆచూకీ దొరకలేదు. దీంతో హకీం పట్టణ పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ధర్పల్లి: ధర్పల్లిలోని భీమ్‌గల్ రోడ్డులో కోళ్ల ఫామ్ వద్ద ప్రమాదకరంగా మారిన మూల మలుపును సీపీ నాగరాజు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ మలుపు వద్ద బుధవారం బైకు అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరు మరణించిన విషయం తెలిసిందే. మూలమలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరగడంతో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సీపీ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా స్పీడ్ బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్అండ్‌బీ డీఈ సుధీర్, సీఐలు సైదా, శ్రీశైలం, ఎస్సై వంశీకృష్ణ అధికారులు ఉన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న సీపీ నాగరాజు

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ

సిరికొండ: సిరికొండలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ కొట్టిన ఘటనపై డీసీడీవో వనిత గురువారం విచారణ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దినేష్‌ను పరీక్ష కోసం సరిగా చదవడం లేదని గత నెల 31న ప్రిన్సిపాల్ సునీత కొట్టింది. ఆ విద్యార్థికి తలపైన, చెవికి గాయాలయ్యాయని తల్లిదండ్రులు డీఈవోకు వాట్సప్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో విచారణకు డీసీడీవోను పంపించారు. ఆ తరగతిలోని విద్యార్థులను ఉపాధ్యాయులను డీసీడీవో విచారించారు. విచారణలో విద్యార్థిని కొట్టిన విషయం వాస్తవమే అని తెలిసిందని, విచారణ పూర్తి నివేదికను డీఈవోకు అందచేస్తానని ఆమె పేర్కొన్నారు.



విచారణ జరుపుతున్న డీసీడీవో వనిత

చదవకుండా అల్లరి చేయడంతోనే పది వరకు విద్యార్థులను కొట్టినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. అందరి విద్యార్థుల్లానే దినేష్‌ను కొట్టానని, దెబ్బలు తగిలేలా గట్టిగా కొట్టలేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

వెంచర్ పనుల నిలిపివేత

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రా మంలో శివాలయం శివారులో 1274, 1275 సర్వే నంబర్లలో అసైన్డ్ భూమిలో చేపట్టిన వెంచర్ పనులను గురువారం నిలిపివేసినట్లు తహసీల్దార్ రోజా తెలిపారు. అసైన్డ్ భూమిలో పంటల సాగు కాకుండా నివాసపు ప్లాట్లుగా మార్చేందుకు మొరం పోస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి తనిఖీ చేశామన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా పడి యువకుడి మృతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ఓ వ్యక్తి ఇంట్లో పీవోపీ పనులను చేసేందుకు ట్రాలీ ఆటోలో హైదరాబాద్ నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి బీహార్‌కు చెందిన అరవింద్ (27) మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల్ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రామ్, అరవింద్, సోను హైద్రాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా ఎల్లారెడ్డికి ట్రాలీ ఆటోలో వస్తుండగా కొట్టాల్ శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ఆటోబోల్తా పడింది. ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామ్, సోనులకు తీవ్ర గాయాలు కాగా అరవింద్ ఘటన స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



అరవింద్ మృతదేహం

వారం రోజుల్లో కుమారుడి పెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- వివాహానికి మేకలు తీసుకురావడానికి వెళ్తుండగా ఘటన



దుర్గయ్య మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్: వారం రోజుల్లో కుమారుడి పెళ్లి ఉండగా రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించాడు. వివరాలు.. ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన పేరు దుర్గయ్య(60) కుమారుడు వెంకట్ వివాహం ఈ నెల 9న జరగాల్సి ఉంది. పెళ్లికి మేకల కోసం దుర్గయ్య తన తమ్ముడు రాములుతో కలిసి గురువారం తెల్లవారుజామున ఎక్సెల్‌పై బాన్సువాడకు బయలు దేరాడు. మండలంలోని బొగ్గుగుడిసె శివారులో గుర్తు తెలియని బైక్ వీరిని ఢీకొనడంతో దుర్గయ్య అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో తండ్రి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు..

పిట్లం: పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజని గ్రామానికి చెందిన గజ్జల బలరాం గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గజ్జల బలరాం (50) ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ కరెంట్ షాక్‌తో చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన అంజవ్వ చూసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. మృతుడికి నాలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

మాచారెడ్డి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి భవానీపేట తండాలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని భవానీపేట తండాకు చెందిన బానోత్ రమేష్ (35) కు 15 క్రితం అదే గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి భార్య దూరంగా ఉంటోంది. భార్య కాపురానికి రాకపోవడంతో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. రెండో భార్య కూడా గొడవపడి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్ గ్రామానికి సమీపంలోని చెరువులో దూకాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు నుంచి తీసి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ఫంగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో ఒకరు..

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన అంకం రాజేందర్(47) గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. వివరాలు.. రాజేందర్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో రాత్రి 11 గంటల వరకు ఆయనకు భార్య, కుటుంబీకులు సేవలను అందించినట్లు తెలిపారు. గురువారం ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు భార్యకు సమాచారం అందించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎడపల్లిలో ఒకరు..

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన కాచిగూడ గంగారాం(51) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భూదెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పాండేరావు తెలిపారు.



గంగారాం మృతదేహం

గంజాయి రవాణాలో పిట్లం వాసులు

నిజాంసాగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం నుంచి ఎండు గంజాయిని కారులో తరలిస్తూ భద్రాచలం దొరికిన వారిలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లాలోని భద్రాచలం బ్రిడ్జి వద్ద గురువారం వేకువజామున ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఒక కారును తనిఖీ చేయగా కారు కింది భాగంలో ఎండు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. కారులోని ముగ్గురు నిందితుల్లో పిట్లం మండలానికి చెందిన నిఖిల్‌కుమార్, రాందాస్ ఉన్నారు. కారు తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న ఇద్దరు పరారు కాగా నిఖిల్‌కుమార్ దొరికారు. 20 కిలోల ఎండుగంజాయి, కారును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



ఖమ్మం జిల్లాలో దొరికిన గంజాయి ప్యాకెట్లు

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్‌కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. మాచారెడ్డికి చెందిన గంగుల రాములు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ కొద్ది రోజులుగా కామారెడ్డిలోని పీఎంహెచ్ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. గత నెల ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన చుట్టూ పక్కల వారు రాములుకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు. ఇంట్లోని రెండు తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, ఒక టీవీ చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

మరో ఇంట్లో చోరీకి యత్నం

పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ తాళం వేసిన ఇంట్లో దొంగలు బుధవారం రాత్రి చోరీకి యత్నించారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. విలువైన వస్తువులు చోరీకి గురి కాలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లి నుంచి ఆటో ముగ్గురు ప్రయాణికులతో కలిసి బయలుదేరి డిచ్‌పల్లి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో అర్గుల్ జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ముందటి అద్దాలు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో బాలాగనర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రమేష్ అందులో ప్రయాణిస్తున్న సాయమ్మ, చిలుకమ్మతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

లారీని ఢీకొని డాక్టర్‌కు గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వర్తించే డాక్టర్ విష్ణు గురువారం ఉదయం లారీని ఢీకొని గాయపడ్డాడు. టీ తాగేందుకు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎదురుగా ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో విష్ణు లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



పంచనామా చేస్తున్న పోలీసులు

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన చెరుకు తోటలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. చెరుకు తోటను కౌలుకు చేస్తున్న రైతు రాజేశ్ వాసన రావడంతో గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

గజ్యానాయక్ తండా శివారులో..

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా శివారులో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు.. 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ శవం కుళ్లిపోయి ఉన్న దశలో గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మహిళ ఒంటిపై వంకాయ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ఉన్నట్లు తెలిపారు.

నగరంలో వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని ఖలీల్‌వాడిలో అద్దె భవనంలో ఉంటున్న గుర్తు తెలియని మహిళ (70) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మహిళ చనిపోయి మూడు రోజులు అవుతుందని చెప్పారు. దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సదరు మహిళ ఖలీల్‌వాడిలో 30 ఏళ్లుగా వివిధ హాస్పిటళ్లలో పని చేసినట్లు సమాచారం.